సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 14 । మార్చి । 2023



ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేసినట్లు పీలేరు ఎఫ్ఆర్వో వెంకటరమణ తెలిపారు. - 8లో



హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

సిద్దవటం మండలం ఉప్పరపల్లెలో ఆదివారం రూ.300 కోసం దాడి చేసి హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులను సోమవారం అరెస్టు చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.100	రూ.140
రెండోరకం	రూ.60	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 249 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	370	710
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 722.84 కిలోలు

పోలింగ్ ప్రశాంతం

- చిన్నపాటి ఘటనలకు కూడా ఆస్కారం లేకుండా ఎమ్మెల్సీ ఎన్నికలు
- 'పశ్చిమ : 68.31, తూర్పు' గ్రాడ్యుయేట్ పోలింగ్‌లో 70.66 శాతం నమోదు
- ఉపాధ్యాయుల ఓట్లు పశ్చిమ 93.36, తూర్పు 89.44 శాతం నమోదు
- ఓటింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్ పీఎస్ గిరీషా, జేసీ తమీమ్ అన్సారియాలు
- బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



సుండుపల్లెలో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

సాక్షి రాయచోటి : శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అధికారులు తీసుకున్న చర్యల ఫలితం...ముందస్తు జాగ్రత్తల వ్యూహం సత్ఫలితాలిచ్చింది. ఎక్కడా కూడా చిన్నపాటి ఘటనకు కూడా ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో...ఓటర్లు స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి పశ్చిమ, తూర్పు రాయలసీమ నియోజకవర్గాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ సంపూర్ణమైంది. కొంతమేర ఓటర్లు ఓటువేసే విషయంలో తికమకకు గురైనా పోలింగ్ మాత్రం ఎలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా జరిగిపోయింది. పశ్చిమ రాయలసీమ పరిధిలో ఉపాధ్యాయ ఓటింగ్ రికార్డు స్థాయిలో 93.36 శాతం నమోదు కావడం విశేషం.

బారులు తీరిన ఓటర్లు

అన్నమయ్య జిల్లాలో తూర్పు, పశ్చిమ రాయలసీమ నియోజకవర్గాలకు సంబంధించి సోమవారం ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ సందర్భంగా ఓటర్లు బారులు తీరారు. యువతీ యువకులతో పాటు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఉదయం కొంత మందకొడిగా కనిపించినా తర్వాత ఎండ ఉన్నప్పటికీ ఓటర్లు లెక్కచేయకుండా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పశ్చిమ రాయలసీమకు సంబంధించి రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గ ఓటర్లు బారులు తీరారు. అలాగే తూర్పు రాయలసీమకు సంబంధించి పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల ఓటర్లు క్యూలైన్లలో నిలబడి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో భారీగా ఓటింగ్ శాతం నమోదు

అన్నమయ్య జిల్లాలో తూర్పు, పశ్చిమ రాయలసీమ నియోజకవర్గాల పరిధిలో గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీగా ఓటింగ్ శాతం నమోదైంది. పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం పట్టభద్రులకు సంబంధించి మొత్తం ఓట్లు 20,594 ఉండగా, 14,068 ఓట్లు పోలయ్యాయి. అందులో పురుషులకు సంబంధించి 9615, మహిళలకు సంబంధించి 4452 ఓట్లు పోల్ కావడంతో ఓటింగ్ శాతం 68.31గా నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి మొత్తం ఓట్లు 1958 కాగా, అందులో 1828 ఓట్లు పోలయ్యాయి. పురుషులకు సంబంధించి 1246, మహిళలకు సంబంధించి 582 ఓట్లు పోలయ్యాయి. దీంతో 93.36 శాతం ఓటింగ్ నమోదై రికార్డు సృష్టించింది. తూర్పు రాయలసీమ నియోజకవర్గం పట్టభద్రుల పరిధిలో మొత్తం 23,838 ఓట్లు కాగా, అందులో 16845 ఓట్లు పోలయ్యాయి. వాటిలో పురుషులకు సంబంధించి 11146 మంది ఓటుహక్కు వినియోగించుకోగా, మహిళలు 5699 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోవడంతో ఓటింగ్‌శాతం 70.66గా నమోదైంది. ఇక ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 1932 మొత్తం ఓట్లు కాగా, అందులో 1728 ఓట్లు పోలయ్యాయి. 1014 మంది పురుషులు, 714 మంది మహిళా ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో 89.44 పోలింగ్ శాతంగా నమోదైంది.

బందోబస్తు పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం ప్రాంతాలలో పర్యటించారు. ఎక్కడికక్కడ పోలీసు సిబ్బందికి సూచనలు చేయడంతోపాటు బందోబస్తును పర్యవేక్షించారు. రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ పికెట్లు తదితర పోలీసు సిబ్బందికి ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 923 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో చిన్నపాటి సమస్యలకు కూడా అవకాశం లేకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

తూర్పు రాయలసీమ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాయంత్రం 4 గంటల సమయానికి పట్టభద్రుల స్థానానికి పోలింగ్ 65.28 శాతం, టీచర్ స్థానానికి పోలింగ్ 84.92 శాతం నమోదైంది. తూర్పు రాయలసీమ పరిధిలో నిర్వహించిన పట్టభద్రుల ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ ఎక్కడా నమోదు కాలేదు. తిరుపతి, నెల్లూరు, బాపట్ల, ప్రకాశం, అన్నమయ్య జిల్లాల కలెక్టర్‌లు, ఎస్పీలు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.

వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్

అన్నమయ్య జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన 81 పోలింగ్ బూత్‌లలో జరిగిన పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఉదయం నుంచి కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూములో కూర్చొని సరళిని పరిశీలించారు. అనుమానాలు ఉన్న సందర్భంలో అధికారులతో మాట్లాడుతూ వచ్చారు. రాయచోటిలోని ప్రభుత్వ డైట్ హైస్కూలులోని పోలింగ్ కేంద్రంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓటర్ల మధ్య నుంచి పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి అధికారులకు పలు సూచనలు చేశారు.

మదనపల్లెలో..

మదనపల్లె : మదనపల్లె ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ జెడ్పీహైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని జెడ్పీహైస్కూల్, బీటీ కళాశాలలో పోలింగ్ సరళిని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

బీజేపీ నాయకుల హడావుడి

పట్టణంలోని బీటీ కళాశాల పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ వసీం, నాయకులు రహీం, చరణ్ తదితరులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు లోపలకు వెళితే...టీడీపీ, బీజేపీ నాయకులు అపార్థం చేసుకుని ఓటర్లను ప్రలోభపెడుతున్నారని, పోలింగ్ కేంద్రంలోకి ఎందుకు వారిని అనుమతించారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. టీడీపీ నాయకులను కలుపుకుని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటేసి వస్తున్న వారిని నిలువరించి గొడవకు దిగే ప్రయత్నం చేశారు. దీంతో కొంతసేపు గందరగోళం ఏర్పడింది. డీఎస్పీ కేశప్ప పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పోలింగ్ సాగుతోందని, ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేదని చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.



బీటీ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల సరళిని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



పోలింగ్‌లో ఇబ్బందులు సృష్టించవద్దని బీజేపీ, టీడీపీ నాయకులకు నచ్చజెపుతున్న డీఎస్పీ

పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

రాజంపేట : రాజంపేట పరిధిలోని పోలింగ్ సరళిని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు పరిశీలించారు.



ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఓవర్ యాక్షన్

కురబలకోట : నెల్లూరుకు చెందిన ఇండిపెండెంట్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంకయ్య చౌదరి వ్యవహారం వివాదాస్పదంగా మారింది. నెల్లూరుకు చెందిన ఇతను నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. సోమవారం పోలింగ్ పరిశీలనలో భాగంగా తంబళ్లపల్లెకు వచ్చారు. అక్కడ పోలింగ్ గడువు ముగిశాక పోలింగ్ వివరాలను (ఫారం 16) ఇవ్వాలని అధికారులను దురుసుగా అడిగారు. అక్కడున్న అధికార యంత్రాంగం కొంత సేపు ఉండాలని చెప్పినా వినిపించుకోకుండా వారి పట్ల దురుసుగా వ్యవహరించాడు. దీంతో స్వల్ప వివాదం చోటు చేసుకుంది. అనంతరం ఇతను తంబళ్లపల్లె నుంచి ముదివేడు వస్తుండగా కొందరు అతని కారుపై దాడి చేశారు. ఈ విషయాన్ని అతను ముదివేడు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా ఇతను కిడ్నాప్‌కు గురయ్యాడంటూ జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని, అతను క్షేమంగా స్వగ్రామం వెళ్లిపోయాడని ఎస్ఐ సుకుమార్ తెలిపారు.

న్యూస్‌రీల్

రానున్న ఎన్నికల్లోనూ ఇలాగే పనిచేయాలి

– ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అన్నమయ్య జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా విధులు నిర్వర్తించడంపై జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో కూడా పనిచేసి జిల్లా పోలీసు యంత్రాంగానికి మంచి పేరు తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.

16 నుంచి ఉమ్మడిజిల్లాలో వర్షాలు

కడప అగ్రికల్చర్ : వాతావరణశాఖ వారి సూచన మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే) కో–ఆర్డినేటర్ వీరయ్య , వాతావరణశాఖ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. అక్కడక్కడా గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం కూడా ఉందని చెప్పారు. కావున రైతులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం

– ఇంటర్ ఆర్ఐఓ రమణరాజు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఇంటర్ ఆర్ఐవో రమణరాజ పేర్కొన్నారు. సోమవారం కడపలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 92 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్షలు 15వ తేదీ ప్రారంభమై ఏప్రిల్ 4న ముగుస్తాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు.

ఆస్కార్ విజేతలకు గడికోట శుభాకాంక్షలు

రాయచోటిటౌన్ : ఆస్కార్ అవార్డుకు ఎంపికైన విజేతలకు అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ తెలుగు పాటకు ఆస్కార్ అవార్డు పొందడం భారతదేశానికి గర్వకారణమన్నారు.గీతరచయిత చంద్రబోస్, స్వరకర్త కీరవాణి, దర్శకుడు రాజమౌళి, గాయకులు రాహుల్ సిప్లీగంజ్, కాలభైరవలకు శుభాకాంక్షలు తెలియజేశారు.













వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తున్న కలెక్టర్, జేసీ, రాయచోటిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న జేసీ, ఆర్డీఓ, ఎస్పీ, రైల్వేకోడూరులో ఓటు వేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, రాజంపేటలో దివ్యాంగ ఓటరును మోసుకొస్తూ.., గాలివీడులో తండ్రిసాయంతో..

బాబు మాటలు.. నీటి మూటలు!

- గత పాలనలో సీఎంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో 4 సార్లు పర్యటించిన చంద్రబాబు
- టమాట రైతులు మొదలుకుని నిరుద్యోగుల వరకు హామీల వర్షం
- ఒక్కటీ అమలుకు నోచుకోని వైనం



2015 మే 7న అంగళ్లులో జరిగిన రైతు సదస్సులో మాట్లాడుతున్న చంద్రబాబు (ఫైల్)

బి.కొత్తకోట : ముఖ్యమంత్రి హోదాలో హామీలు ఇస్తే అమలవుతాయని, తమ జీవితాలు, ప్రాంతాలు బాగుపడతాయని అంతా ఆశిస్తారు. 2019 వరకు కరువుకు నిలయంగా, అభివృద్ధికి దూరంగా ఉన్న మారుమూల తంబళ్లపల్లె నియోజకవర్గం అభివృద్ధికి ఎన్నో హామీలిచ్చిన చంద్రబాబు అందులో ఒక్క హామీని అమలు చేయలేకపోయారు. సీఎం హోదాలో 2014, 2015, 2016లో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట మండలంలో ఒకసారి, కురబలకోట మండలంలో మూడుసార్లు పర్యటించారు. ఈ పర్యటన, బహిరంగ సభల్లో ఆయనిచ్చిన హామీలకే దిక్కులేకుండా పోయింది. ఉత్తుత్తి హామీలుగానే మిగిలిపోయాయి.

చంద్రబాబు పర్యటించిన వివరాలు:

- 2014 నవంబర్ 5న కురబలకోట మండలం అంగళ్లులో జన్మభూమి–మా ఊరు బహిరంగ సభలో పాల్గొన్నారు.
- 2015 ఫిబ్రవరి 19 బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం చెరువులో నీరు–చెట్టు పథకానికి శ్రీకారం చుట్టిన సభలో పాల్గొన్నారు.
- 2015 మే 7–8 కురబలకోట మండలం అంగళ్లు రైతు సదస్సు, హంద్రీనీవా కాలువపై నిద్రలో పాల్గొన్నారు.
- 2016 ఆగస్టు 19న కురబలకోట మండలం ముదివేడులో పంటకుంటల పరిశీలన, రైతులతో సభ నిర్వహించి పాల్గొన్నారు.

ఈ సభల్లో ఇచ్చిన హామీలు.. వాటి స్థితిగతులు ఇలా..

- హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను 2015 వర్షాకాలంలోగా తంబళ్లపల్లె నియోజకవర్గానికి రప్పించి 147 చెరువులకు నీళ్లిస్తామన్నారు..జరగలేదు.
- జిల్లాలో పాడిరైతులు రోజుకు 22 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి చేస్తున్నారు, ఈ ఉత్పత్తిస్థాయి 50లక్షల లీటర్లకు పెంచేలా ప్రణాళిక అమలు చేస్తామని ప్రకటించారు... అమలు కాలేదు.
- గ్రామాలకు వెలుపల 400 నుంచి 500 పశువులకు వసతి కల్పించడానికి వీలుగా పశువుల హాస్టల్స్‌ను నిర్మిస్తామన్నారు..జరగలేదు.
- పశుగ్రాసం కోసం 50 నుంచి 60 ఎకరాల్లో సామూహికంగా పశుగ్రాసాన్ని పెంచి గ్రాసం కొరత తీరుస్తానని ప్రకటించారు....జరగలేదు.
- పశువుల హాస్టల్స్‌లో లభించే పేడ, పంచీతం (మూత్రం)తో బయోగ్యాస్ తయారుచేసి.. ఆయా గ్రామాల్లోని ఇళ్లకు గ్యాస్ అందిస్తామన్నారు. పశువుల పేడతో ఎరువును తయారుచేసి విక్రయిస్తామన్నారు. ఈ పథకాన్ని చిత్తూరుజిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుచేస్తామన్నారు..జరగలేదు.
- తంబళ్లపల్లె నియోజకవర్గంలోని టమాట రైతులకు రూ.10కోట్ల ప్యాకేజీని ప్రకటించారు...అమలుకాలేదు.
- అనంతపురం జిల్లాలో అమలులో ఉన్న కరువు ప్యాకేజీని అమలుచేసి రైతాంగాన్ని ఆదుకొంటామన్నారు..జరగలేదు.
- పారిశ్రామికాభివృద్ధికి ఊతం ఇచ్చేలా బెంగళూరు నుంచి అనంతపురం జిల్లా మీదుగా తంబళ్లపల్లె మదనపల్లె, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలను కలుపుతూ రింగ్ రోడ్‌ను నిర్మిస్తామన్నారు..ఈ ఊసేలేదు.
- పశ్చిమ మండలాలకు ప్రత్యేక వాటర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించే పథకం అమలు, ఈ గ్రిడ్‌కు హంద్రీ–నీవా ప్రాజెక్టుతో అనుసంధానం హామీ ఇచ్చారు...ఇదీ జరగలేదు. (ఈ వాటర్ గ్రిడ్‌ను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేయగా రూ.2,330 కోట్లతో టెండర్లు పూర్తి చేశారు. త్వరలో పనులు మొదలుకానున్నాయి.)
- టమాట రైతులను ఆదుకునేందుకు, దాని ఆధారిత పరిశ్రమను స్థాపించేందుకు పెప్సికో కంపెనీతో మాట్లాడం జరిగిందని ప్రకటించారు...మరచిపోయారు.
- తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలను కలుపుతూ ప్రత్యేకమైన గ్రిడ్‌ను అమలులోకి తీసుకొస్తామని ప్రకటించారు.
- బెంగళూరు విమానాశ్రయం నుంచి అనంతపురం జిల్లాలోని లేపాక్షి, పుట్టపర్తి, కదిరి మీదుగా తంబళ్లపల్లె–మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం, తమిళనాడులోకి కృష్ణగిరిని కలుపుతూ ఏర్పాటు చేస్తామన్న కారిడార్ ఊసేలేదు.
- తంబళ్లపల్లె ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతానని అన్నారేకాని మరచిపోయారు.
- బి.కొత్తకోటలో డిగ్రీకళాశాల ఏర్పాటుచేసి అందులో ఉద్యోగాలు లభించే కోర్సులను ప్రారంభిస్తామన్నారు. (జీవో ఇచ్చి చేతులుదులుపుకొన్నారు.) కళాశాల ఇప్పటికీ ప్రారంభం కాలేదు.
- కురబలకోట మండలంలోని ఇంజిరింగ్ కళాశాలల్లో చదువుకొన్న విద్యార్థులు ఉద్యోగాల కోసం వలసలు వెళ్లకుండా స్థానికంగా హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఐటీ సంస్థలను స్థాపించి..కుప్పం, పలమనేరు ప్రాంతాలకు విస్తరింపజేస్తామన్నారు..మరచిపోయారు.

టీడీపీ కవ్వింపు చర్యలు!



రాజంపేట : పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బత్యాల

సాక్షి ప్రతినిధి, కడప : ఓటమికి ముందే సాకుల కోసం తెలుగుదేశం పార్టీ కవ్వింపు చర్యలకు పాల్పడింది. ఏమి లేకపోయినా అనవసర రాద్ధాంతం చేస్తూ అభాండాలు వేసేందుకు ముందస్తు పథకం ప్రకారం వ్యవహరించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఘోర పరాభవం తప్పడం లేదని విశ్లేషకులు మొదటి నుంచి వెల్లడిస్తున్నారు. పోలింగ్ నాడిని పసిగట్టిన టీడీపీ నేతలు ఉదయం నుంచి ఓటమికి ముందే సాకులు వెతికే పనిలో నిమగ్నమయ్యారు. అందుకోసం ప్రత్యేక ప్రణాళిక మేరకు టీడీపీ నేతలు అనుచరులతో కలిసి గుంపులుగా వెళ్తూ హంగామా చేశారు. లింగాలలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అనుచరులను వెంటేసుకొని నడుచుకుంటూ వస్తుండగా రాళ్లు చేతిలో ధరించిన అనుచరులు వైఎస్సార్ సీపీ నేతలను దూషిస్తున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అలాగే పోలింగ్ జనరల్ ఏజెంట్‌గా ఉన్న టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి అదే విధంగా వ్యవహరించారు. మున్సిపల్ ఉర్దూ బాలుర హైస్కూల్ వద్దకు అనుచరవర్గంతో చేరుకున్నారు. వారంతా సెల్‌ఫోన్లు చిత్రీకరిస్తూ పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించడంపై వైఎస్సార్ సీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉండగా అంతమందిని ఎలా అనుమతిస్తారని అధికారులను ప్రశ్నించడంతో టీడీపీ నేతలు వెంటనే వాగ్వివాదానికి దిగారు. ఇరువర్గాల మధ్య తోపులాట నెలకొంది. అదేవిధంగా రాజంపేట బాలికల హైస్కూల్‌లో పోలింగ్ ముగిసే సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడు తన వర్గీయులతో పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. పోలింగ్ సమయం ముగిసిందని ఇప్పుడెలా పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లడానికి అనుమతి ఇస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి పోలీసులను ప్రశ్నించారు. ఒక్కమారుగా టీడీపీ నేతలు రెచ్చిపోయారు. దీంతో పోలింగ్ గేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

అధిష్టానం మెప్పు కోసమే..

ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా టీడీపీ నేతల హంగామా కేవలం అధిష్టానం మెప్పుకోసమేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఆయా నేతలు ఎవరికి వారు పరపతి పెంచుకునే చర్యల్లో భాగంగానే ఇలా వ్యవహరించారని పలువురు వివరిస్తున్నారు. గొడవలు జరగాలని భావించిన టీడీపీ నేతలకు ప్రశాంత పోలింగ్ జీర్ణించుకోలేని అంశంగా మారింది.

క్లుప్తంగా

గాయపడిన వ్యక్తి మృతి

పెద్దమండ్యం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ పి.వెంకటేష్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోటకాడపల్లె పంచాయతీ యర్రసానివారిపల్లెకు చెందిన ఎం.మల్లికార్జున(40) కలిచెర్ల - పెద్దమండ్యం రహదారిపై ఎన్‌వోపల్లె సచివాలయం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆయన మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ..

కలకడ : కలకడ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ రెడ్డిబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం కలకడ రాజీవ్‌నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్‌సాబ్ కుమారుడు ఖాదర్ వల్లీ (47) తన ద్విచక్రవాహనంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ నుంచి ఇందిరమ్మ కాలనీ వైపు వెళ్తుండగా.. వేలూరు నుంచి హైదరాబాద్ వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్ర గాయాల పాలు కావడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. ఆయన బావమరిది ఫజుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

వివాహిత అదృశ్యం



సరస్వతి (ఫైల్)

మదనపల్లె : మండల పరిధిలోని పాన్నూటిపాళెం పంచాయతీలో ఓ వివాహిత అదృశ్యమైంది. తాలూకా సీఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సరస్వతినగర్‌కు చెందిన నరసింహులు భార్య సరస్వతి(20) ఈ నెల 11 నుంచి కనిపించకుండా వెళ్లిపోయింది. దీంతో భర్త, కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాపం పండింది.. శిక్ష పడింది

- చనిపోయేంత వరకు జైలుశిక్ష
- తల్లీకూతుళ్లను చంపేసి, బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు
- చిత్తూరు న్యాయమూర్తి తీర్పు



మౌలాలి (ఫైల్)

తంబళ్లపల్లె/బి.కొత్తకోట : చేసిన నేరం పాపమై పండింది.. నిందితుడికి జైలు శిక్ష పడింది. వివాహేతర బంధంలో తలెత్తిన అనుమానంతో ప్రియురాలిని హత్య చేసి.. ఈ విషయాన్ని దాచేందుకు ఆమె తల్లిని కూడా చంపేశాడు. వరసకు కూతురైన మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ కేసులో నిందితునికి చిత్తూరు స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి సోమవారం శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసును దర్యాప్తు చేసిన అప్పటి ములకలచెరువు సీఐ పి.సురేష్‌కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

వివాహేతర బంధంతో మొదలై..

తంబళ్లపల్లె మండలం గోవిందువారిపల్లెకు చెందిన గంగులమ్మకు సరళమ్మ కుమార్తె. ఈమెకు ముగ్గురు కుమార్తెలు. సరళమ్మ భర్త 8 ఏళ్ల క్రితం మృతి చెందడంతో తల్లి గంగులమ్మ ఇంటిలో ఉంటోంది. భూ సమస్యకు సంబంధించి సరళమ్మ తరచూ తహసీల్దార్ కార్యాలయానికి వస్తుండేది. ఈ నేపథ్యంలో గంగిరెడ్డిగారిపల్లెకు చెందిన సయ్యద్‌మౌలాలి (47)తో వివాహేతర బంధం ఏర్పడింది. వారు కలిసి నివసించే వారు. వివాహేతర బంధం విషయం అందరికీ తెలియడంతో కాపురాన్ని ఏటిగడ్డతండాకు మార్చారు. నాలుగేళ్లు అక్కడ ఉండి గ్రామానికి సమీపంలో రేకులషెడ్డును నిర్మించుకుని కాపురం ఉంటూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో సరళమ్మ ఫోన్‌లో ఎవరో వ్యక్తితో మాట్లాడటం తెలిసి మాట్లాడవద్దని మౌలాలి చెప్పినా వినలేదు. 2020 సెప్టెంబర్ 29న వేరుశనగ పొలంలోకి పందులు వస్తున్నాయని సరళమ్మ, మౌలాలి కాపలా కాస్తూ మంచంపై పడుకున్నారు. వేరే వ్యక్తులతో ఎందుకు మాట్లాడుతున్నావని మౌలాలి ప్రశ్నించడంతో.. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపంతో మౌలాలి కట్టెతో సరళమ్మ ఎడమ పక్క కణితిపై కొట్టడంతో కింద పడిపోయింది. చనిపోయిందని నిర్ధారించుకుని మృతదేహాన్ని సమీపంలోని పెద్దేరు ప్రాజెక్టులోకి ట్యూబ్‌పై తీసుకెళ్లి శవం తేలకుండా బండరాళ్లను కట్టి నీటిలోకి పడేశాడు. ఉదయం కుమార్తె ఎక్కడని తల్లి గంగులమ్మ ప్రశ్నించగా అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లిందని చెప్పి నమ్మించే ప్రయత్నం చేశాడు. 2020 అక్టోబర్ 1న సరళమ్మ ఎక్కడని గంగులమ్మ గట్టిగా నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో అదే రోజు రాత్రి ఆమెకు మద్యం తాగించాడు. ఇంటి బయట నిద్రిస్తున్న గంగులమ్మ అర్ధరాత్రి దాటాక ఆమె చీర కొంగుతో గొంతుకు బిగించి హత్య చేశాడు. చనిపోయిన గంగులమ్మ మృతదేహాన్ని బైక్‌పై తీసుకెళ్లి గంగచెరువులో చెట్టు మొదలుకు చీరను కట్టి నీటిలో పడేశాడు. మరుసటి రోజు తల్లి, అవ్వ ఎక్కడున్నారని మౌలాలిని సరళమ్మ కుమార్తెలు ప్రశ్నించగా.. కరోనా సోకి ఆస్పత్రికి వెళ్లారని నయమయ్యాక వస్తారని నమ్మించాడు.

పిల్లలను కర్ణాటకకు తీసుకెళ్లి..

ముగ్గురు పిల్లలను కర్ణాటకలోని గౌనిపల్లెకు తీసుకెళ్లి అక్కడ అద్దె ఇంటిలో ఉంచాడు. అక్కడ సరళమ్మ పెద్ద కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడి వేధించాడు. చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయం బాహ్యప్రపంచానికి తెలియకుండా పోయింది. పీలేరులోని ఏటిగడ్డ గ్రామానికి చెందిన బంధువులు గోవిందువారిపల్లెకు వచ్చి గంగులమ్మ గురించి ఆరా తీయగా కనిపించలేదు. దీనితో పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి తంబళ్లపల్లె ఎస్‌ఐ సహదేవి అదృశ్యం కేసు నమోదు చేశారు. దర్యాప్తులో హత్యలుగా వెలుగు చూడటంతో సీఐ సురేష్‌కుమార్ దర్యాప్తు ప్రారంభించారు. తర్వాత బాలికపై లైంగిక దాడి వెలుగులోకి రావడంతో అప్పటి మదనపల్లె డీఎస్పీ రవి మనోహరాచారి దర్యాప్తు చేశారు.

డీఎన్‌ఏ పరీక్షల ద్వారా మృతుల గుర్తింపు

సరళమ్మ మృతదేహాన్ని బండరాళ్లతో కట్టి పెద్దేరు ప్రాజెక్టులో వేయడంతో వెలికి తీసేందుకు రెండు రోజులు పట్టింది. ప్రాజెక్టులో నిండుగా నీళ్లు ఉండటంతో మృతదేహం ఎక్కడుందో గుర్తించేందుకు బోర్ కెమెరాలను ఉపయోగించారు. తెప్పలపై వెళ్లి శోధించారు. అప్పటికే మృతదేహాన్ని చేపలు తినేశాయి. గంగచెరువులోని గంగులమ్మ మృతదేహాన్ని వెలికితీశారు. గుర్తు పట్టలేని విధంగా ఉండటంతో డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించి మృతులను గుర్తించారు. తర్వాత నిందితుడు మౌలాలి కర్ణాటకలో నివసించిన ప్రాంతంలో దర్యాప్తు చేశారు. జంట హత్యలు, మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్టు నిర్ధారించి ఆధారాలు సేకరించడంతో మౌలాలిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. మౌలాలికి చనిపోయేంత వరకు జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ.. బాధిత బాలికకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఈ కేసులో న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

రూ.300 కోసం జరిగిన గొడవలో..



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లెలో ఆదివారం రూ.300 కోసం దాడి చేసి హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులను సోమవారం అరెస్టు చేశారు. సిద్దవటం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు వివరాలు వెల్లడించారు. ఉప్పరపల్లె గ్రామానికి చెందిన భీమిశెట్టి లక్ష్మీనరసింహులు అతని పెద్దమ్మ లక్షుమమ్మ ఇంట్లో పెరిగిన టేకు చెట్లను కొట్టించేందుకు మండలంలోని మధవరం-1 పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీకి చెందిన పత్తూరు శ్రీనివాసులు, అతని ఇద్దరు కుమారులైన నాగేంద్ర, మణీంద్రతో రూ.600కు బేరం కుదుర్చుకున్నారు. చెట్లు కొట్టిన తర్వాత వీరు అదనంగా రూ.300 అడిగారు. అదనంగా ఎందుకు ఇవ్వాలని లక్ష్మీనరసింహులు ప్రశ్నించాడు. పై ముగ్గురు అతనితో వాగ్వాదానికి దిగారు. లక్ష్మీనరసింహులును శ్రీనివాసులు పట్టుకోగా.. మణీంద్ర రించ్ స్క్రూడ్రైవర్‌తో తలపై పొడిచాడు. వెంటనే నాగేంద్ర ఇనుప వాటర్‌పైప్‌తో కొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి ఆదిలక్షుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్దవటం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులు పత్తూరు శ్రీనివాసులు, మణీంద్ర, నాగేంద్రను సోమవారం సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న మలినేనిపట్నం గ్రామం వద్ద అరెస్టు చేశారు. హత్యకు వినియోగించిన రింగ్ స్క్రూడ్రైవర్, ఇనుప వాటర్‌పైప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరు పరిచారు. సమావేశంలో ఎస్‌ఐ తులసీనాగప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రాజు, పోలీసులు పాల్గొన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసినందుకు కడప సబ్‌డివిజన్ అధికారి బి.వెంకటశివారెడ్డి, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిద్దవటం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్, పోలీసులను జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

ఏసీబీ కేసులో నాలుగేళ్ల జైలు

కడప అర్బన్ : అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) కేసులో ఓ అధికారికి నాలుగేళ్ల జైలు శిక్ష పడింది. కర్నూలు ప్రత్యేక న్యాయమూర్తి కడప రేంజ్ క్రైమ్ నంబర్: 55/2013లో నిందితుడైన అప్పటి అనంతపురం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బసిరెడ్డి ఓబుల్‌రెడ్డికి నాలుగేళ్లపాటు కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఆ కేసులో ఆదాయ వనరులకు మించి అక్రమాస్తులు ఉన్నట్లు నిరూపించి, దోషిగా నిర్ధారించారు. ఒకవేళ జరిమానా కట్టకపోతే మరో ఐదు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. నిందితుడికి సంబంధించిన అక్రమ ఆస్తులను రాష్ట్రానికి జప్తు చేయాలని ఆదేశించారు.

6 ఎర్రచందనం దుంగల స్వాధీనం

నిందితుడి అరెస్ట్



ఎర్రచందనం దుంగలు, నిందితుడు, వాహనంతో అటవీ శాఖ అధికారులు

పీలేరు : ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలా వున్నాయి. కలికిరి - కందూరు మార్గంలో ఎర్రచందనం తరలిస్తున్నారన్న సమాచారంతో అటవీ సిబ్బంది కందూరు వంక వద్ద నిఘా ఉంచారు. సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అతివేగంగా వచ్చిన వాహనాన్ని సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ ఆపకుండా ముందుకు పోవడంతో ఫారెస్ట్ సిబ్బంది వాహనాన్ని చుట్టుముట్టి పట్టుకున్నారు. వాహనాన్ని పరిశీలించగా ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. ఆ వాహనం, 175 కేజీల బరువు గల 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడులోని వేలూరు జిల్లా పించమందైకు చెందిన దొరస్వామిని అరెస్ట్ చేయగా రమేష్, సురేష్, గణేష్, కృష్ణ, రామ అనే నిందితులు పరారైనట్లు ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. ఈ దాడిలో అటవీ సిబ్బంది ప్రతాప్, కుప్పుస్వామి, ప్రభుతేజ, చరణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతి చెందిన రవిచంద్ర

మదనపల్లె : మదనపల్లె పట్టణంలో సోమవారం వాటర్ ట్యాంకర్ ఢీకొనడంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం తుమ్మకూరు జిల్లా కొడిగెనహళ్లి మండలం పార్థుహళ్లికి చెందిన హనుమంతప్ప కుమారుడు రవిచంద్ర(28) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చాడు. కదిరి రోడ్డులోని బంధువుల ఇంటికి నడుచుకుని వెళ్తుండగా పట్టణంలోకి వస్తున్న నీళ్ల ట్యాంకర్ రవిచంద్ర వెనుకవైపున దూసుకెళ్తూ ఢీకొంది. ఆయన తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రామాంజనేయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కలికిరి : కలికిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంకలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలికిరి-పీలేరు మార్గం కొర్లకుంట సమీపాన బడబళ్ళవంక వద్ద మృతదేహం నీటిలో తేలియాడుతున్నట్లు స్థానికులు సోమవారం సాయంత్రం గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న హెడ్‌కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉండవచ్చని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. రెండు రోజుల క్రితం నీటిలో పడి మృతి చెంది వుండవచ్చని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.